

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

నిజాంపేట, ఏప్రిల్ 25 : తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేటలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని అన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, గడిచిన ఏడాదిన్నర పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, గ్రా మ అధ్యక్షుడు నాగరాజు, మాజీ సర్పంచ్‌లు గోపరి నర్సింహులు, అరుణ్ కుమార్, సంగుస్వామి, మంగ్యా నాయక్, మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు దుబ్బరాజగౌడ్, దయాకర్, నరేందర్ నాయక్, రాములు, మావురం రాజు, మహిపాల్, రవి, వెంకట్‌గౌడ్, లక్ష్మీనర్సింహులు, నగేశ్, మల్లేశం, రాము, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పెంటయ్య, తిరుమల్, సిద్ధిరాములు, మల్లేశం తదితరులు ఉన్నారు.

**పరామర్శ**

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 25 : బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మండల పరిధిలోని టి.మాందాపూర్ గిరిజన తండా మాజీ సర్పంచ్ శారదకు ఇటీవల కాలు విరగడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. టి.మాందాపూర్ గ్రామానికి చెందిన పిల్లుట్ల కోటయ్యను పరామర్శించి రూ. ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆమె వెంట జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయకులు ఉన్నారు.

**చిలిపిచెడ్‌లో..**

చిలిపిచెడ్, ఏప్రిల్ 25 : మండల కేంద్రమైన చిలిపిచెడ్‌తో పాటు గ్రామాల్లో ప్రధాన వీధుల వద్ద బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ, కేసీఆర్, కేటీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అని పదలు గోడలపై రాతను చూసి ప్రజలు, రైతులు సంతోష పడుతున్నారు. రజతోత్సవ భారీ బహిరంగ సభకు చిలిపిచెడ్ మండలం నుంచి పది ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్తున్నట్లు మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు.

## డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25 : నిరుద్యోగ యువత డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ విభాగాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీ ద్వారా యువతకు సమాచారం, విద్యావనరులను అందించడం ద్వారా వారి జ్ఞానాన్ని పెంచడానికి సహాయపడుతుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీ,యువకుల కోసం ఇంటర్‌నెట్ సేవలతో కూడిన డిజిటల్ లైబ్రరీకి పది కంప్యూటర్లతో లైబ్రరీని ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ,యువకులు ఈ సేవలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్‌నెట్ సౌకర్యాలు, వసతుల గురించి గ్రంథాలయాల కార్యదర్శి వంశీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, మురళి, ఉమాదేవి, పాఠకులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌లో డిజిటల్ సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25 : ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలని కలెక్టర్ రాహుల్ రాజ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్ పీడీ మాణిక్యం, జీపీవో యాదయ్యలతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల ధ్రువీకరణ ఎంపికలపై సంబంధిత ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా టెలికాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన వెరిఫికేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని 21 మండలాలతో పాటు మున్సిపాలిటీలను కలిపి మొత్తం 67 మంది వెరిఫికేషన్ అధికారులను నియమించామని, ఈ మొత్తం ప్రక్రియ ఏప్రిల్ 30 వరకు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంపికలో ఏవైనా సందేహాలు ఉంటే రిమార్క్ కాలమ్‌లో నమోదు చేయాలన్నారు. నిరుపేదలు, ఇండ్లు లేని వారినే ఎంపిక చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఎంపీడీవోలు పాల్గొన్నారు.

**భూ భారతిపై అవగాహన సదస్సు**

చేగుంట,ఏప్రిల్ 25 : భూ వివాదాలను పరిష్కారించి, భూములపై పూర్తి హక్కును కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశ పెట్టిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. నార్సింగి తహసీల్దార్ కరీం ఆధ్వర్యంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. తూప్రాన్ ఆర్డీవో జైచంద్రరెడ్డి, తహసీల్దార్ కరీం, ఎంపీడీవో ఆనంద్, ఏవో యాదగిరి, సర్వేయర్ శ్రీకాంత్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, ఏప్రిల్ 25 : గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి పాపన్నపేట గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఉండడాన్ని అటుగా వెళ్లిన స్థానికులు గమనించి, పోలీసులకు సమాచరమిచ్చారు. వ్యక్తి వయస్సు సుమారు 30-40 మధ్య ఉంటుందని తెలిపారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే మెదక్ గ్రామీ ణ సీఐ రాజశేఖర్‌రెడ్డి సెల్ 87126579 16,ఎస్సై శ్రీనివాస్ గౌడ్ 8712657920 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## పిడుగు పాటుకు యువకుడికి తీవ్రగాయాలు

కౌడిపల్లి, ఏప్రిల్ 25 : పిడుగు పాటుకు గురై యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని వెల్మకన్నలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కర్ణం సురేశ్ (35) రోజు మాదిరిగానే మేకలను మేపడానికి వెళ్లాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా వర్షం కురవడంతో ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో పిడుగు పడింది. ఈఘటనలో సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సురేశ్‌ను కౌడిపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.

### వైద్యశిబిరానికి స్పందన

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 25 : ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్నశంకరంపేటలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ లైన్ ఏలేటి రాజశేఖర్, వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట,ఏప్రిల్ 25 : కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మడూర్, ఖాజాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



ప్రపంచ మలేరియా దినం సందర్భంగా డి.ధర్మారంలో డాక్టర్ హరిప్రియ నేతృత్వంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య, వైద్య సిబ్బంది.
-రామాయంపేట, ఏప్రిల్ 25

# ధాన్యం కాంటాకు రైతుల పడిగాపులు

- కొనుగోలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- అకాల వర్షాలతో ఆందోళనలో అన్నదాతలు

నర్సాపూర్, ఏప్రిల్ 25 : ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకొని నాలుగు పైసలు వెనకేసుకుందామనే రైతులకు కొనుగోలు కేంద్రాల్లో చేదు అనుభవం ఎదురవుతున్నది. చేతి కొచ్చిన పంటను కోత కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే ఆ ధాన్యాన్ని నిర్వాహకులు తూకం వేయకపోవడంతో రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామంలో ప్రతి సీజన్ మాదిరిగానే పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈ సారి కూడా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కోత కోసిన ధాన్యాన్ని 15 రోజుల క్రితమే రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు అధికారులు, నిర్వాహకులు తూకం సామగ్రి ఏర్పాటు చేయలేదు. ఈ మధ్య కురిసిన వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, మళ్లీ ఎండకు ఆరబెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో ఇప్పటికే నష్టపోయామని, తూకం వేయకపోవడం తో ఇబ్బందిగా ఉందని అన్నదాతలు ఆవేద ను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా ధాన్యాన్ని తూకం వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**కౌడిపల్లిలో..**

కౌడిపల్లి, ఏప్రిల్25 :కౌడిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రా ల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి పోగా, పలు కేంద్రాల్లో వర్షం దాటికి వడ్లు కొట్టుకు పోయాయి.



కొనుగోలు కేంద్రంలో ధాన్యపు కుప్పలు



కౌడిపల్లి : తిమ్మాపూర్ కొనుగోలు కేంద్రంలో నీళ్లు నిలిచిన దృశ్యం

**వారం రోజులవుతున్నా.. తూకం వేయలేదు**



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి వారం గడుస్తున్నా ఇప్పటి వరకు తూకం వేయలేదు. పైగా ఆరబెట్టిన ధాన్యం వర్షం పడి మళ్లీ తడిసింది. కేంద్రం నిర్వాహకులను తూకం ఎప్పుడు వేస్తారని అడుగగా ఒకటో తేదిన వేస్తామని సమాధానం ఇస్తున్నారు. ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి 15 రోజులు గడిచిపోయింది. ఇంకెన్ని రోజులు మేము ధాన్యానికి కాపలగా ఉండాలి, ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలి.

**-అనిల్, తిర్మలాపూర్, రైతు**

**హమాలీల కొరతతో తూకం ఆలస్యం**

హమాలీల కొరతతోనే కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడం ఆలస్యమైంది. లోకల్ హమాలీలు కూలీకి రావడానికి శ్రద్ధ చూపడం లేదు. అందుకే బీహారీలను రప్పిస్తున్నాం. ఇప్పటికే కొంత మంది హమాలీలు వచ్చారు. రెండు రోజుల్లో తూకం వేసి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తాం.

**-వెంకటస్వామి, పీఏసీఎస్ సీఈవో**



కొల్చారం: రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 25 : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మెన్ అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హస్తాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో సిద్ధయ్య, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని మద్దతు ధర అందించి ఆదుకోవడం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, తాలు లేకుండా, నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారులకు ధాన్యం విక్రయిస్తే ధర తక్కువతో పాటు తూకంలో అవకతవకలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



హస్తాల్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, చైర్మన్లు

## పదిరోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదు..

కొల్చారం, ఏప్రిల్ 25 : కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పదిరోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని, ధాన్యం తూకంలో జాప్యం చేయొద్దని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే శుక్రవారం మండల పరిధిలోని రాంపూర్, పైతర, కోనాపూర్, మందాపూర్ గ్రామాల్లో మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా త్వరిత గతిన ధాన్యం తూకం జరిపించాలన్నారు. తహసీల్దార్ గఫర్ మియా, నాయబ్ తహసీల్దార్ నాగవర్ధన్, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, కొల్చారం వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరి శంకర్ గుప్తా, యువత అధ్యక్షుడు సంతోష్ రావు, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, ముత్యం గారి సంతోశ్ కుమార్, రంగంపేట సొసైటీ చైర్మన్ రమేశ్, బీఆర్ఎస్ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, మోత్కు మల్లేశం, చిట్యాల యాదయ్య, గౌరి శంకర్, భాగా రెడ్డి, సిద్ధిరాములు, ఆరే రవీందర్, ఐకేపీ ఏపీఎం సుశీల్వ, సీసీ సబిత పాల్గొన్నారు.

### ధాన్యాన్ని త్వరగా దింపుకోవాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 25 : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల నిర్వాహకులు త్వరగా దింపుకొని సహకరించాలని తహసీల్దార్ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంతో పాటు పలు రైస్‌మిల్లులను ఆర్ఐ నర్సింగ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు దింపుకొనేలా చూడాలని సూచించామని తెలిపారు.



చీలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 25 : కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సంజీవరెడ్డి అన్నారు. మండలపరిధిలోని చీలపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకులు రాయిని మధు, సంగమేశ్వర్, పెరుమాల్‌గౌడ్, సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి



రవికుమార్‌ను సన్మానిస్తున్న ఆటో జేఏసీ జిల్లా నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25 : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకానికి ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 వేలు అందజేస్తూ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నేరవేర్చలాని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన ఆటో రథయాత్ర శుక్రవారం మెదక్ పట్టణానికి చేరుకున్నది. నేటి వరకు సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రథయాత్ర 32 రోజుల పాటు రాష్ట్రమంతా పర్యటించి మే 27న హైదరాబాద్‌కు చేరుకొని ఇందిర పార్క్‌లో మహాసభ నిర్వహిస్తామన్నారు. జేఏసీ బాధ్యులు ముజీబ్, బ షీర్, రాకేశ్, మతిన్, ప్రేమ్ కుమార్, నరేశ్, ఖలీల్ పాల్గొన్నారు.

## మనస్తాపంతో భగీరథ ఉద్యోగి ఆత్మహత్య

రామాయంపేట, ఏప్రిల్ 25 : కుటుంబ కలహాలతో మిషన్ భగీరథ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కల్వల రాజు (33) మిషన్ భగీరథ ఉద్యోగి. కొన్ని రోజులుగా కుటుంబంలో గొడవలు జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురై గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై బాలరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 'పేట'కు చేరుకున్న పాదయాత్ర

రామాయంపేట, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ అభిమాని పాదయాత్ర రామాయంపేటకు చేరుకున్నది. బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు రాగి ఉమా మహేశ్వర్ అభిమానికి ఘన స్వాగతం పలికారు. జిల్లాలోని కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన గడ్డమీది రవి తన స్వ గ్రామం నుంచి వరంగల్ జిల్లా ఎల్కతుర్తికి బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభలకు వెళ్తున్నట్లు తెలిపారు.



రామాయంపేటకు చేరుకున్న రవి పాదయాత్ర

## అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలి

రామాయంపేట, ఏప్రిల్ 25 : రామాయంపేట జాతీయ రహదారి 44 బైపాస్ వైజంక్షన్ వద్ద హైవే అథారిటీ బృందం శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా ఫెన్సింగ్ పనులు చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న పు ర పాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని ఫెన్సింగ్ పనులను నిలిపేశారు. తమకు రోడ్డు దాటాలంటే ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయిని తీరా తాము పంట పొలాలకు వెళ్లకుండా ఫెన్సింగ్ వేయడం సరికాదని హెచ్చరించారు. ముందు తమకు వ్యవసాయ బావులకు రోడ్డు దాటడం కోసం అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు తమ సిబ్బందితో బైపాస్‌కు చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. 15 రోజుల్లో సమస్యను రైతులు పరిష్కరించుకోవాలని ఎస్సై ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో రైతులు చేస్తున్న ఆందోళనను విరమించారు.



గొల్పర్తి గ్రామస్తులను సముదాయిస్తున్న రామాయంపేట ఎస్సై బాలరాజు



మెదక్ మున్సిపాలిటీ : మెదక్ పట్టణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



మెదక్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగదళ్ నాయకులు



నర్సాపూర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలుపుతున్నముస్లింలు

## అమరులకు నివాళి

ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన భారతీయుల ఆత్మశాంతించాలని కోరుతూ శుక్రవారం పలు గ్రామాల్లో శాంతి ర్యాలీ, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మెదక్ పట్టణంలోని ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్నం మసీదులో ప్రార్థనలు చేశారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

-మెదక్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 25



చేగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు





చేగుంట: రెడ్డిపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు,చిన్నారులు

### ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 25 : రైతులు పంటమార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని లివ్‌ఫామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని గొట్టిముక్కులలో అయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ మొక్కలకు అధిక మొత్తంలో సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### చిరు వ్యాపారులను వేధించొద్దు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25 : మెదక్ పట్టణంలోని ఫుట్‌పాత్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులను వేధించొద్దంటూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వేసవి వరకు చిరు వ్యాపారులను వేధించొద్దని కమిషనర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. వారి వెంట మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, జయరాజ్, ప్రభురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి, జుబేర్ తదితరులు ఉన్నారు.

### పైప్‌లైన్‌కు శంకుస్థాపన

నర్సాపూర్, ఏప్రిల్ 25 : పట్టణంలోని అమృత్ 2.0 వాటర్ ట్యాంకులకు సంబంధించిన పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషర్ రామకృష్ణ, ఏఈ కిష్టయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు ఉన్నారు.

### విద్యార్థులకు సమ్మర్ క్యాంపు

వెల్దుర్తి, ఏప్రిల్ 25 : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంతో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఆర్ట్, డ్రాయింగ్, క్రాఫ్ట్‌లో శిక్షణను ఇస్తున్నారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, వెంకటేశ్, దిగంబర్ మాట్లాడుతూ ఈ నెల 24న ఈ క్యాంప్‌ను ప్రారంభించామని, ఈ నెల 30 వరకు కొనసాగుతుందన్నారు. రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉంటుందని సుమారు 80 మంది విద్యార్థులు వస్తున్నారని తెలిపారు.

### ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 25 : బంధువుల విందు కోసం వచ్చిన ఓ వ్యక్తి శుక్రవారం ఏడుపాయల్లో నీట మునిగి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం మరికెల్ గ్రామానికి చెందిన వీరస్వామి (40) కుటుంబంతో కలిసి బంధువుల విందులో పాల్గొనడానికి శుక్రవారం ఏడుపాయలకు వచ్చాడు. అమ్మవారి దర్శనానికి ముందు స్నానం చేసేందుకు చెక్ డ్యామ్‌లోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### వడ్డేపల్లిలో చిరుత సంచారం

చేగుంట/రాయపోల్,ఏప్రిల్ 25 : వడ్డేపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరించడం కలకలం రేపింది. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన వేముల రాజయ్య తన వ్యవసాయ పొలం వద్ద కోతుల రక్షణకు కుక్కలను కట్టి వేసి ఇంటికి వెళ్లి పోయాడు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా, రెండు కుక్కలను చిరుతపులి చంపి వేసినట్లు, ఇట్టి విషయమై ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎఫ్ఆర్‌వో సందీప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, చుట్టు పక్కల వారు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.